క్లుప్తంగా

నూతన తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారు సత్యనారాయణను సన్మానిస్తున్న రాజేష్

మాడుగుల రూరల్: ఇటీవల నూతన తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన టి. సత్యనారాయణను ఎం. కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ సన్మానించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన్ను కలిసి రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. డిప్యూటీ తహసీల్దారు పి. సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో పారదర్శకంగా సేవలు



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

నాతవరం: ప్రజలకు అవసరమైన సేవలను గ్రామ సచివాలయం ద్వారా పారదర్శకంగా అందించాలని డీఎల్‌డీవో ఉదయశ్రీ తెలిపారు. ఎం.బెన్నవరం సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేసింది. రికార్డులను పరిశీలించి సచివాలయం ద్వారా అందించిన సేవలపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో కులగణన సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట సెక్రటరీ శ్రీను, సిబ్బంది ఉన్నారు.

శివాలయంలో గ్రానైట్ గచ్చు ఏర్పాటు



శివాలయంలో దాత సహకారంతో ఏర్పాటు చేసిన గ్రానైట్ గచ్చు

మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయంలో దాత సహకారంతో గ్రానైట్‌తో గచ్చు ఏర్పాటు చేశారు. ఆలయం మండపంతోపాటు గర్భగుడిలో స్థానిక వర్తకుడు కొట్యాడ భాస్కరరావు రూ.2 లక్షలు వెచ్చించి దీన్ని చేయించారు. ఆయన్ను భక్తులు, గ్రామస్తులు, గౌరీ భజన సేవా సంఘం సభ్యులు అభినందించారు. ఆలయం ముందు భాగంలో సిమెంటు రోడ్డును దాతల సహకారంతో వేయించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన నిధులతో మూడు మాసాల క్రితం ఇక్కడ తాగునీటి బోరు ఏర్పాటు చేశారు.

9న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మాడుగుల రూరల్: గ్రామాల్లో ఈ నెల 9న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని వైద్యాధికారి కె. లీలాప్రసాదు తెలిపారు. ఆశ దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.జె.పురం పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు సారథ్యంలో వీటిని పంపిణీ చేశాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సిహెచ్. పుష్పమ్మ, పీహెచ్ఎన్ ఇందిర, ఆరోగ్య సహాయకులు, పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి వైద్యాధికారి బి. రవితేజ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

9న మండల సర్వసభ్య సమావేశం

దేవరాపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు శాఖాపరమైన తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో జయరాం



నాతవరం సచివాలయంలో రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తున్న కోటవురట్ల సబ్ రిజిస్ట్రారు నర్సింహమూర్తి

- పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు
- నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేశామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి. జయరాం అన్నారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్‌లో జగనన్న లేఅవుట్లలో 12 వేల ఇళ్ల స్థలాల లబ్ధిదారులకుగాను ఐదు వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. కొన్ని సచివాలయాల్లో కంప్యూటర్లు మొరాయిండంతో పాటు కొంత మంది సిబ్బందికి అవగాహన లేకపోవడంతో ఆశించిన విధంగా రిజిస్ట్రేషన్లు కాలేదన్నారు. వారికి అవగాహన కల్పించి వేగవంతంగా చేసేలా చర్యలు చేపట్టామన్నారు. డివిజన్‌లో మంగళవారం నాటికి వంద మాత్రమే రిజిస్ట్రేషన్లు కావంతో అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. నిర్లక్ష్యంగా పని చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటితోపాటు ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్ అధికారులు బాధ్యత గా వ్యవహరించాలన్నారు.ఏ చిన్నపాటి పొరపాటు దొర్లినా ఎలాంటి అధికారైనా ఇంటికి పోవడం ఖాయమన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దివ్యాంగులు, వృద్ధు లు ఓటేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నా రు. కార్యక్రమంలో డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టరు కె. వెంకటరమణ, తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీవో జె.రాంబాబు, ఎస్ఐ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, మండల సర్వేయరు బాలరెడ్డి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ వీఆర్వో లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

నాతవరం: ప్రభుత్వ నిబందనలు అనుసరించి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయాలని కోటవురట్ల సబ్ రిజిస్ట్రారు నర్సింహమూర్తి అన్నారు. ఆయన మంగళవారం నాతవరం, మర్రిపాలెం, సరుగుడు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. సరుగుడులో రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విధమైన రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చేయించుకోవాలంటే లబ్ధిదారుడికి చాలా ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం చక్కటి అవకాశమన్నారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసేటప్పుడు సాంకేతికపరమైన సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరగలేదని, పాత రేట్లు ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామన్నారు. నాతవరం సచివాలయ కార్యదర్శి శ్రీను సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల పదవీ కాలం పొడిగింపుపై హర్షం



డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పర్సన్ ఇన్‌చార్జి రామారావు, సీఈవో సత్యనారాయణ

మాడుగుల: పీఏసీఎస్‌ల పదవీ కాలం మరో ఆర్నెల్ల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పొడిగించడంపై వీరనారాయణం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారపు రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడును తారువ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

చీడికాడ: బైలపూడిలో వైఎస్సార్‌సీపీ నేత జాజిమొగ్గల ఈశ్వరరావు కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పరామర్శించారు. ఇటీవల ఈశ్వరరావు తల్లి దేముడమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, గ్రామంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ కురచా జయమ్మ, వైఎస్సార్‌సీపీ చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, యువజన విభాగం అధ్యక్షుడు స్వామినాయుడు, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, దేవినాయుడు, నందారపు రమణబాబు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే గణేష్



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం అమరావతిలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని, ఇంకా చేపట్టాల్సిన పనుల జాబితాను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. పనులు పూర్తి చేసేందుకు అవసర మైన నిధులు మంజూరు చేయాలని కోరడంతో సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మాకవరపాలెం: స్థానిక మహిళా మార్ట్ సమీపంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు శివమనోహర్‌నాయుడు తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్టు చెప్పారు.

ఎన్నికల నిబంధనల మేరకు పనిచేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీవో రాంబాబు



ములకలాపల్లిలో ఈవీఎం ఓటింగ్ వేస్తున్న ప్రజలు

నాతవరం: ఎన్నికలు నిబంధనల మేరకు అధికారులంతా పని చేయాలని తహసీల్దార్ ఎస్.రమేష్ కుమార్, ఎంపీడీవో జె.రాంబాబు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, పోలింగ్ బూత్ అధికారులకు సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఉండే అధికారులంతా నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్ చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అదేవిధంగా ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు చేయుట, అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై ఓటర్లకు అవగాహన

రావికమతం: ఈవీఎంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ములకలాపల్లి, చీమలపాడు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం మాక్ ఓటింగ్ నిర్వహించారు. ఆర్ఐ సతీష్, వీఆర్వోలు, వీఆర్ఏలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌పై అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలి.. వేసే ఓటు నచ్చిన గుర్తుకు పడిందా లేదా అనే విషయాలను వివరించడమే గాక సందేహాలను నివృత్తి చేశారు.

వీఆర్వోలు రైతులను మోసం చేస్తే చర్యలు

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



తహసీల్దార్ రవిచంద్ర, డీటీ అప్పారావుతో చర్చిస్తున్న ఆర్డీవో జయరాం

రోలుగుంట: వీఆర్వోలు తప్పులకు పాల్పడి రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.జయరాం హెచ్చరించారు, స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సాయంత్రం సందర్శించారు. ముందుగా కొత్తగా బదిలీపై ఇక్కడకు వచ్చిన తహసీల్దార్ రవిచంద్ర, హెచ్.డి.టి. అప్పారావులకు పలు సూచనలు చేశారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత నుంచి రైతుల పడుతున్న భూ సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చేపట్టిందన్నారు. అందులో భాగంగా భూ రీసర్వే చేపట్టి న్యాయం చేస్తోందని, దీనిని మన శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి ఏ విధమైన సమస్యలొచ్చినా వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలోనే భూ సర్వే విధుల్లో అనకాపల్లి జిల్లా టాప్‌లో ఉందన్నారు. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ అలానే ఉందన్నారు. రోలుగుంట మండలంలో రెండు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లోను సర్వే పూర్తయిందన్నారు. రైతుల ఫిర్యాదుల మేరకు బాధ్యులైన వీఆర్వోల రికార్డులను పరిశీలించి తదుపరి చర్యల కోసం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి నివేదిస్తామన్నారు. కొంతమంది వీఆర్వోలు అసిస్టెంట్లతో పని చేయడాన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్లతో పనులు చేయిస్తే తప్పులకు ఆస్కారమవుతుందని, దీనివల్ల రైతులకు మేలు కన్నా నష్టమే అధికమవుతుందని హెచ్చరించారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పరుగు పోటీలు



పరుగులు తీస్తున్న ఎడ్లబండి



ముగ్గులు వేస్తున్న మహిళలు

రావికమతం: కొత్తకోటలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. మంగళవారం ఇక్కడ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తీర్థ మహోత్సవం సందర్భంగా సాయంత్రం నిర్వహించిన ఈ పోటీల్లో పలు గ్రామాల నుంచి 16 బళ్లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా చుక్కపల్లి ఎడ్లబండి నిలిచింది. తర్వాత స్థానాల్లో ఎం.కోటపాడు, కూండ్రం, సింహాద్రిపురం గ్రామాలకు చెందిన బండ్లు నిలిచాయి. వీటికి రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.4 వేల చొప్పున బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వాటికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహమందించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

నేటి నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

- ప్రత్యేక ఆకర్షణగా 90 అడుగుల బండ ప్రభ
- రోలుగుంట వీధుల్లో విద్యుత్తు అలంకరణలు



మిరుమిట్లు గొలుపుతున్న విద్యుత్ లైటింగ్



గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న ఉప సర్పంచ్ చిరంజీవి, ఉత్సవ కమిటీ సభ్యులు

రోలుగుంట: జిల్లాలో పేరెన్నికగన్న రోలుగుంట గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మునసబ్ వర్గీయులు పోతల లక్ష్మీ శ్రీనివాస్, జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు మండలాల నుంచి లక్ష మంది భక్తులు వస్తారని అంచనా. తొలి రోజు వేకువ జామున బుడబుడకల వేషంతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో వెదురు కలపతో తయారైన 90 అడుగుల బండి ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీన్ని సాయంత్రం పోలిరెడ్డి నర్సింహమూర్తి ఇంటి నుంచి భక్తులు భుజాలపై తీసుకొచ్చి ఉత్సవ స్థలంలో ప్రతిష్ఠిస్తారు. ఆ రాత్రి ఉత్సవమూర్తులను భక్తుల సందర్శనార్థం రథంపై ఉంచుతారు. గురువారం చిన్నతీర్థం, శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పగటి వేషాలు ప్రదర్శిస్తారు. వీటితోపాటు ఆర్కెస్ట్రా, ఈటీవీ, సినీ కళాకారుల డూప్స్, రేలారే రేలా, నేలడ్యాన్సులు, కేరళ నృత్యాలు ప్రదర్శిస్తారు. శనివారం ఉదయం స్థానిక కోనేరులో గౌరీపరమేశ్వరుల విగ్రహాల నిమజ్జనంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ మేరకు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాల నిర్వహణకు కొత్తకోట సర్కిల్ పరిధిలో ఎస్ఐలు పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కొండపాలెంలో కనులపండువగా..

కొండపాలెంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, ఉత్సవ కమిటీ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి పల్లకిపై ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో పలు డ్యాన్సులు, తప్పుడుగుళ్ళు, చిడతల భజనలో ఊరేగించారు. సర్పంచ్ బంటు లక్ష్మి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎం. కోడూరు మోదమాంబకు వెండి బహూకరణ



సర్పంచ్ సంజీవిరావుకు వెండి అందజేస్తున్న దాత వెంకట రవితేజ

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ ఆరాధ్య దైవం మోదకొండమ్మకు వెండి ఆభరణాల కోసం ముప్పావు తులం వెండిని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు దాత మంగళవారం రాత్రి అందజేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దివంగత, ఆర్ఎంపీ వైద్యుడు కాటకోట సత్యనారాయణ కుమార్తె కణితి అనురాధ, కుమారుడు వెంకట రవితేజ విశాఖ నగరంలోని సుజాత నగర్‌లో ఉంటున్నారు. వీరు ముప్పావు కిలో (750 గ్రాములు) వెండిని అందజేశారు. దీంతో వెండి గొడ్డలి, గద, తయారు చేసి అమ్మవారికి అలంకరిస్తామని సర్పంచ్ తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాచిలవానిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాచిలవానిపాలెంలో చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం 134 మందిని పరీక్షించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అచేతన స్థితిలో ఉన్న ముగ్గురు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. ప్రాథమిక పాఠశాలలో 23 మంది విద్యార్థులను పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు కుంకుమ పూజలు

మాకవరపాలెం: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 8న కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్టు విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఆదినారాయణ, శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. బ్రహ్మంగారి మఠం నుంచి వచ్చిన పీఠాధిపతుల సమక్షంలో గురువారం ఉదయం నుంచి ఇక్కడి ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు ప్రారంభమవుతాయన్నారు.

నేడు అభయాంజనేయ తీర్థం

చీడికాడ: అప్పలరాజుపురంలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు తెలిపారు. అభయాంజనేయ స్వామివారి తీర్థ మహోత్సవం సందర్భంగా బుధవారం ఈ పందేలతోపాటు ఆహ్వాన కోలాటం పోటీలు నిర్వహిస్తామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలకు శ్రీరామరక్ష

వైద్య శిబిరాలకు విశేష స్పందన



దేవరాపల్లి : రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి



రావికమతం: వైద్యం చేస్తున్న ప్రత్యేక వైద్య నిపుణురాలు స్మృతి



మాడుగుల : జేడీపేటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్



మాకవరపాలెం: తూటిపాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు



బుచ్చెయ్యపేట: కందిపూడిలో రోగులకు ఆరోగ్యశ్రీ కిట్లు అందిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

దేవరాపల్లి: ప్రజారోగ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. గైనకాలజిస్టు కల్యాణి, చిన్నపిల్లల వైద్యాధికారి జె. వాసవి, దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి. వనజ 411 మందికి వైద్య పరీక్షలు చేశారు. పలువురికి బీపీ, సుగర్, రక్త తదితర పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, పంచాయతీ సెక్రటరీలు ఎస్. శ్రీనివాసరావు, రత్నం పాల్గొన్నారు.

జేడీపేటలో 346 మందికి వైద్య పరీక్షలు

మాడుగుల: జేడీపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, ఈవోపీఆర్డీ మీనాకుమారి రిబ్బన్ కట్ చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కె.ఎం.నాయుడు, కె.సంతోష్‌కుమార్, జి.నరేష్ 345 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో 30 మందికి ఆప్తాలమిస్ట్ నాగలక్ష్మి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైద్యాధికారులు గ్రామాలకు వచ్చి ఉచిత వైద్యంతోపాటు ఖరీదైన మందులు అందజేయడం ఇంతవరకు ఎక్కడా లేదన్నారు.

పి.పొన్నవోలులో 352 మందికి..

రావికమతం: జగనన్న ఆరోగ్య సురక్ష –2 శిబిరాన్ని మంగళవారం పి.పొన్నవోలులో నిర్వహించారు. ఈ శిబిరంలో చోడవరం సీహెచ్‌సీ గైనిక్ వైద్యనిపుణులు స్మృతి, ఎండీ మల్లికార్జునరావు, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి సురేఖ పాల్గొన్నారు. కీళ్ల నొప్పులు, జ్వరం, ఆస్మా, తదితర రోగాలకు 352 మందిని పరీక్షించారు. అత్యధికంగా రోగులు హాజరైనప్పటికీ వైద్య బృందం, అధికారుల సమన్వయంతో పనిచేశారు. అందరికీ ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ విరోది రాజారావు , ఎంపీడీవో భానోజీరావు, కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు పాల్గొన్నారు.

387 మందికి వైద్య పరీక్షలు

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సచివాలయం పరిధిలోని తూటిపాల, మామిడిపాలెం, పోతలూరు, అడిగర్లపాలెం గ్రామాల నుంచి 387 మంది రోగులు హాజరై వైద్య సేవలు పొందారు. స్థానిక వైద్యులు సాయిచరణ్, చరిష్మతో పాటు స్పెషలిస్టు వైద్యులు విద్యాసాగర్, పృథ్వీ కుమార్ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారంతో స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గవిరెడ్డి ప్రసాద్, బుడ్డా రమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రుత్తల రాజు, ఎంపీహెచ్ఈవో రామచంద్రరావు పాల్గొన్నారు.

కందిపూడిలో 372 మందికి..

బుచ్చెయ్యపేట: కందిపూడిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 372 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. స్పెషలిస్టు వైద్యులు వినయ్‌కుమార్, అనిల్‌కుమార్, కె. వెంకటకృష్ణ ఉచితంగా పరీక్షించి మందులు అందించారు. కె. కందిపూడి, పి. కందిపూడి, కొండకుమ్మర, పోలేపల్లి తదితర గ్రామాల రోగులు హాజరయ్యారు. వీరిలో 25 మందికి ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించి మెరుగైన వైద్య సేవలకు ఎంపిక చేశారు. ఎంపీడీవో వెంకటచార్య, జెడ్పీటీసీ దొండా రాంబాబు, నాయకులు కొప్పాక గణేష్, సీతా సన్యాసిరావు పాల్గొన్నారు.